ఉష్ణోగ్రత (అంచనా)

1-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	28
తెనాలి	39	28
నరసరావుపేట	41	27
బాపట్ల	37	29
రెంటచింతల	42	27

అమరావతి

అష్టదిగ్బంధనం

- రేపే ప్రధాని మంత్రి మోదీ పర్యటన
- సిద్ధమైన బహిరంగ సభా వేదిక ప్రాంగణం
- రాజధాని గ్రామాల్లో విస్తృతంగా పోలీసుల తనిఖీలు
- 100 మంది ఐపీఎస్‌లు.. 6 వేల మంది పోలీసులతో భద్రత



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఐజీ త్రిపాఠి



సిద్ధమైన ప్రధాన వేదిక, రైతుల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలు





ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

తుళ్లూరు(వెలగపూడి), తాడికొండ, గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం సాయంత్రం రాజధాని అమరావతికి రానున్నారు. ఈ క్రమంలో రాజధాని అమరావతిలో ప్రధాని పర్యటించనున్న ప్రాంతాన్ని ఇప్పటికే అష్టదిగ్బంధనం చేశారు. మోదీ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వెలగపూడి సచివాలయం దగ్గర్లో ప్రధాని సభ ఏర్పాట్లన్నీ బుధవారం సాయంత్రానికి అధికారులు పూర్తి చేశారు. ప్రధాని సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. నాలుగు హెలీ ప్యాడ్‌లను సిద్ధం చేశారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రధానితో ఉంటారు. రాజధానికి భూములిచ్చిన రైతుల కోసం ప్రత్యేక గ్యాలరీను కూడా సిద్ధం చేశారు. ప్రధాని పర్యటనకు మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని పాల్గొనే బహిరంగ సభ వేదిక చుట్టూ ఎస్పీజీ బలగాలే పహారా కాయనున్నాయి. ఆ తర్వాత ఇంటిలిజెన్స్ వర్గాలతో పాటు బాంబ్ డిస్పోజల్ బృందాలు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేయనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధాని పర్యటనపై కేంద్ర హోంశాఖతో పాటు రాష్ట్ర పోలీసు యంత్రాంగం పూర్తిగా దృష్టి సారించింది. మోదీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర నలుమూల నుంచి ఆరు వేల మంది పోలీసులు విధులు నిర్వహించడానికి అమరావతి చేరుకున్నారు. 100 మంది ఐపీఎస్‌లు, 50 మంది ఏఎస్పీలు, 150 మంది డీఎస్పీలు, 250 మంది సీఐలు, 1000 మంది ఎస్ఐలతో పాటు ఆరు వేల మంది సిబ్బంది భద్రతా విధుల్లో నిమగ్నమయ్యారు. వీరంతా సోమవారం ఇక్కడకు చేరుకున్నారు. తాడికొండ, తాడేపల్లి, తుళ్లూరు, నల్లపాడు, మంగళగిరి తదితర ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఏపీఎస్పీ, ఏపీ గ్రేహౌండ్స్‌ను స్పెషల్ పోలీసు సిబ్బంది పీఎం సభకు భద్రతకు కోసం వచ్చాయి. ఎస్పీజీ, ఎన్ఎస్‌జీ కమాండోలు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. తాడికొండ, తుళ్లూరు పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా పోలీసులు నిరంతం గస్తీ కాస్తున్నారు. ప్రధాని పర్యటించే ప్రాంతాన్ని ఇప్పటికే హైసెక్యూరిటీ జోన్‌గా ప్రకటించారు. అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో ఐజీలు, డీఐజీలు, ఎస్పీలు, నాన్ క్యాడర్ ఎస్పీలు,

(మిగతా 8వ పేజీలో)

నేడు, రేపు నిషేధాజ్ఞలు

గురు, శుక్రవారాల్లో రాజధాని ప్రాంతంలో అనేక నిషేధాజ్ఞలు అమలులో ఉండనున్నాయి. ప్రధాని పాల్గొనే ప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే అదుపులోకి తీసుకోవాలంటూ ఇప్పటికే ఉన్నతాధికారులు కింది స్థాయి సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. తీవ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన కదలికలపై కౌంటర్ ఇంటిలిజెన్స్ బృందాలు ఆరాతీస్తున్నాయి. ప్రధాన మంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం రాత్రి వరకు తాడికొండ, తుళ్లూరు మండలా పరిధిలోని గ్రామాల్లో దుకాణాలు మూసేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

వర్షం వస్తే పార్కింగ్‌కు ప్లాన్ బీ

అమరావతి సభకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చే వారి వాహనాల పార్కింగ్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. జిల్లాల వారీగా వాహనాల పార్కింగ్‌కు 11 ప్రాంతాలను ఎంపిక చేశారు. అయితే వర్షం పడినా పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో రాజధానిలో పరిధిలో గత టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన 360 కిలోమీటర్ల రోడ్లను వాహనాల పార్కింగ్‌కి వినియోగించుకునేలా ప్లాన్‌బీని అధికారులు సిద్ధం చేశారు. ప్లాన్ బీ ప్రకారం 3000 బస్సులు, వెయ్యి కార్ల పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.


రూ.58 వేల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన

అమరావతి రాజధాని నగరంలో ఏకకాలంలో రూ.58 వేల కోట్ల విలువ కాగల బహుళాభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారు. పీఎంవో అధికారికంగా వాటిని ధ్రువీకరించింది. శుక్రవారం సాయంత్రం ప్రధాని పునాదిరాయి వేసే ప్రాజెక్టుల్లో శాశ్వత అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం, ఇతర పరిపాలన భవనాలు, 5,200 కుటుంబాలకు నివాసాలున్నాయి. వీటి విలువ రూ.11,240 కోట్లుగా పీఎంవో పేర్కొన్నది. రూ.17,400 కోట్లు ఖర్చయ్యే 320 కిలోమీటర్ల రోడ్లు, భూగర్భ పైపులైన్లు, కేబుల్స్ నిర్మాణం తదితరాలున్నాయి. రూ.20,400 కోట్లు కాగల ఎల్‌పీఎస్‌లో 1,281 కిలోమీటర్ల రోడ్లు, సెంట్రల్ మీడియన్స్, సైకిల్ ట్రాక్‌లు, రాజధానిని అనుసంధానించే ప్రాజెక్టులున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నిర్మాణం జరగనున్న ఈ అభివృద్ధి పనులు ప్రధాని పర్యటన ముగిసిన మరుసటి రోజు నుంచే పరుగులు పెట్టనున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే యంత్రాలు, కార్మికులు పెద్దసంఖ్యలో ఆయా ప్రాంగణాలకు చేరి ఉన్నారు.

వెస్ట్ బైపాస్, కృష్ణా బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ప్రధాని మోదీ అమరావతి పర్యటన నేపథ్యంలో ఇంకా నిర్మాణం పూర్తికాని విజయవాడ వెస్ట్ బైపాస్, కృష్ణా బ్రిడ్జిపై వాహనరాకపోకలకు అధికారులు తాత్కాలికంగానే అనుమతించారు. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి సభకు తరలివచ్చే వాహనాలకు విజయవాడ పశ్చిమ బైపాస్ మీదగా అనుమతించారు. గొల్లపూడి ఫ్లైఓవర్ దాటిన తర్వాత ఎన్‌హెచ్ - 65 పై ఉన్న ఆర్‌వోబీ మీదగా సూరాయపాలెం నుంచి కృష్ణానదిపై కొత్తగా నిర్మితమైన బ్రిడ్జి మీదగా రాజధానిలోని వెంకటపాలెం గ్రామంలోకి వెళ్లి అక్కడ నుంచి సభాస్థలికి సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌లోకి వాహనాలు చేరుకోవచ్చు. బ్రిడ్జిని సిద్ధం చేయడం కోసం శరవేగంగా బీటీ లేయరు పనులు పూర్తి చేశారు. మూడు కిలోమీటర్ల పొడవున కృష్ణా బ్రిడ్జి మీద ప్రయాణిస్తూ ఒక వైపు కృష్ణా నది అందాలు, మరోవైపు దూరాన ప్రకాశం బ్యారేజ్, నది మధ్యలో దీవులు వీక్షించుకుంటూ అమరావతి రాజధానిలోకి అడుగు పెట్టవచ్చు. అమరావతి సభ పుణ్యమా అని ప్రజలంతా కృష్ణాబ్రిడ్జి గురించి తెలుసుకునే అవకాశం ఏర్పడింది.



..అంతకు మించి



'ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించి.. 5 శాతం రాయితీ పొందండి.' అని ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు విశేష స్పందన లభించింది. మునిసిపాలిటీల్లో పన్ను చెల్లింపుదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. రాయితీ వెసులుబాటు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని పురపాలక సంఘాలకు కాసుల వర్షం కురిపించింది. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు జరిగాయి. నెల రోజుల్లో దాదాపు రూ.104 కోట్లు పన్ను చెల్లించడం విశేషం.

- లక్ష్యాలకు మించి వసూలైన ఆస్తి పన్ను
- మునిసిపాలిటీలకు.. కాసుల వర్షం
- కలిసొచ్చిన 5 శాతం పన్ను రాయితీ
- ఏప్రిల్‌లో ముందస్తు పన్ను వసూళ్లు రూ.104 కోట్లు
- స్వచ్ఛందంగా స్పందించిన పన్నుదారులు
- రాష్ట్రంలో అద్దంకి ప్రథమం.. వినుకొండ ద్వితీయం

మునిసిపాల్టీల వారీగా రాయితీపై పన్ను చెల్లింపు ఇలా

	వార్షిక డిమాండ్ రూ కోట్లలో	పన్ను చెల్లింపు	వసూలు శాతం
పల్నాడు జిల్లా			
నరసరావుపేట	22.18	4.77	21.49
చిలకలూరిపేట	25.17	2.57	10.22
వినుకొండ	7.03	2.68	38.13
సత్తెనపల్లి	10.23	1.98	19.34
పిడుగురాళ్ళ	7.89	1.94	24.65
మాచర్ల	8.33	1.64	19.72
దాచేపల్లి	3.12	0.73	23.32
గురజాల	1.95	0.46	23.39
బాపట్ల జిల్లా			
అద్దంకి	5.28	2.14	40.52
చీరాల	15.38	4.55	29.59
బాపట్ల	15.36	3.34	21.75
రేపల్లె	6.84	1.98	28.98
గుంటూరు జిల్లా			
గుంటూరు	338.72	52.72	15.57
తెనాలి	32.85	7.37	22.43
పొన్నూరు	7.85	2.29	29.24
మంగళగిరి,తాడేపల్లి	46.21	12.82	27.74

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)


పన్ను వసూలుకు మునిసిపల్ సిబ్బంది ఇళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ పరిస్థితి లేకుండానే పన్నుదారులు స్వచ్ఛందంగా పురపాలక కార్యాలయాలకు వచ్చి మరీ పన్ను చెల్లించి.. రాయితీని సద్వినియోగం చేసుకున్నారు. గత నెల 1వ తేదీ నుంచి అమలులో ఉన్న రాయితీ పథకం బుధవారంతో ముగిసింది. రాయితీపై పన్ను వసూలులో అద్దంకి పురపాలిక రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం.. వినుకొండ ద్వితీయ స్థానంలో నిలిచింది.

అంచనాలకు మించి..

ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ ఏప్రిల్ నెలకు మాత్రమే అమలు చేశారు. మునిసిపాలిటీలు కూడా దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాయి. ఈ మేరకు పన్నుదారులు స్పందించడంతో అంచనాలకు మించి పన్ను వసూలైంది. వార్షిక పన్ను డిమాండ్‌లో అద్దంకి మునిసిపాలిటీలో 40.99 శాతం, వినుకొండ మునిసిపాలిటీలో 38.32 శాతం పన్ను చెల్లించారు. ఆరు నెలల్లో వసూలు అయ్యే పన్ను ఒక నెలలో వసూలు కావడం విశేషం. పన్ను వసూలులో పురపాలక సంఘాలు గణనీయమైన వృద్ధిని సాధించాయి.

గుంటూరులో ఒక్క రోజే రూ.4 కోట్లు..

గుంటూరు కార్పొరేషన్‌లో బుధవారం ఒక్క రోజే రూ.4 కోట్లకు పైగా పన్ను చెల్లించడం గమనార్హం. నరసరావుపేట మునిసిపాలిటీ 30 శాతం. గతేడాది కన్నా అధికంగా పన్ను వసూలు చేసింది. చిలకలూరిపేట పురపాలిక 100.50 శాతం, సత్తెనపల్లి మునిసిపాలిటీ 73.20 శాతం వినుకొండ 14.40, పిడుగురాళ్ల 57.84, మాచర్ల 44, దాచేపల్లి 54.50, గురజాల 87.40, గుంటూరు కార్పొరేషన్ 16.60, పొన్నూరు 51.60, తెనాలి 10.90, మంగళగిరి, తాడేపల్లి 38.55, అద్దంకి 21.90, రేపల్లె 45.90, చీరాల 17.50, బాపట్ల 113.20 శాతం అంటే గతేడాది కంటే అధికంగా పన్ను వసూలు చేశాయి. ఇది మునిసిపాలిటీలు సాధించిన ఘనత కాదని... పన్నుదారులు స్వచ్ఛందంగా స్పందించడం వల్లే సాధ్యమైందని చెప్పవచ్చు. పెద్ద ఎత్తున పన్ను చెల్లించడంతో పురపాలక సంఘాలకు ఆర్థిక వెసులుబాటు కలిగింది. జీతాలు సకాలంలో చెల్లించడంతో పాటు ప్రగతి పనులను వేగవంతం చేసే అంకాశం ఏర్పడింది.



ఫలించని.. ఈ-శ్రమ్

- అసంఘటిత కార్మికులకు అక్కరకురాని కార్డులు
- కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో పరిష్కారం కాని క్లెయిములు
- గడిచిన నాలుగేళ్లలో 2 వేలకు పైగా క్లెయిములు
- పరిష్కారానికి నోచుకుంది 2 మాత్రమే!
- జిల్లాలో అర్హులైన లబ్ధిదారులు 20 లక్షలకు పైమాటే
- 'ఈ- శ్రమ్' కార్డులు పొందింది 2.20 లక్షల మందే..

8

పీఎం పర్యటన నేపథ్యంలో వాహనాల దారి మళ్లింపు

రేపటి ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆంక్షలు

6

పొగాకు కొనుగోలు చేసేంతవరకు ఆందోళనలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న మొత్తం పొగాకును కొనుగోలు చేసేంతవరకు ఆందోళనలు నిర్వహించాలని రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం నిర్ణయించింది. గుంటూరులోని పీఎల్ రావు భవన్



సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు

లో బుధవారం రైతు సంఘ నాయకుల రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ రెండు నెలల నుంచి రాష్ట్రంలో పొగాకు కొనుగోలు ప్రక్రియ ఆగిపోయిందని, దీంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ముఖ్యంగా బ్లాక్ బర్లీ కొనుగోలును పూర్తిగా నిలిపివేశారని పేర్కొన్నారు. రైతులు ఎకరాకు రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టారని, పంట చేతికివచ్చే సమయంలో కంపెనీలు తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయన్నారు. లాం ఫామ్‌లో పొగాకు కంపెనీలతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మొత్తం పొగాకు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. దీనికి కంపెనీలు సుముఖత వ్యక్తం చేశాయని, మే నెలలోపు పొగాకు మొత్తం కొనుగోలు చేయకపోతే రైతులతో భారీ ఎత్తున ఆందోళన దిగుతామని హెచ్చరించారు. నాణ్యత, తేమశాతం పేరుతో కొనుగోలు ఆపివేస్తే ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు. పలు రైతు సంఘాల రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య, కేవీవీ ప్రసాదు, కొల్లా రాజమోహన్, ఎం.హరిబాబు, పి.జమలయ్య, వై.రాధాకృష్ణమూర్తి, నరసింహారావు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

లాసెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): న్యాయ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే లా సెట్-25కు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జాగర్లమూడి చంద్రమౌళి, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినేని సుధాకరబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న ఉదయం 9 గంటల నుంచి తరగతులు కళాశాల ఆవరణలో మొదలవుతాయని పేర్కొన్నారు. మూడేళ్ల, ఐదేళ్ల కోర్సులకు జూన్ 5న ప్రవేశ పరీక్షలు ఉంటాయని, వివరాలకు 0863-2350330, 98485 50353 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పీఎం పర్యటన నేపథ్యంలో వాహనాల దారి మళ్లింపు

రేపటి ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆంక్షలు

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కారణంగా శుక్రవారం జాతీయ రహదారుల్లో ట్రాఫిక్ దారి మళ్లిస్తున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. 2న ఉదయం 5 నుండి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని వెల్లడించారు. అమరావతిలో శంకుస్థాపన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన, సంబంధిత బహిరంగ సభ సజావుగా సాగడానికి జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహన రద్దీని నివారించడానికి.. ప్రజల సౌకర్యార్థం ఈ క్రింద విధంగా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు వివరించారు.

ట్రాఫిక్ మళ్లింపులు (భారీ, ఇతర వాహనాలతో సహా)..

చెన్నై వైపు నుండి విశాఖపట్నంకు వయా విజయవాడ మీదుగా.. ఇబ్రహీంపట్నం, నందిగామ, వైపుకు వెళ్లే భారీ గూడ్స్ వాహనాలను ఒంగోలు జిల్లా త్రోవగుంట నుండి చీరాల- బాపట్ల - రేపల్లె - అవనిగడ్డ- పామర్రు గుడివాడ హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం, ఇబ్రహీంపట్నం వైపునకు మళ్లించడం జరుగుతుందన్నారు. విశాఖపట్నం నుండి చెన్నై వైపు వాహనాలు కూడా అదే మార్గంలో వెళ్లాలని సూచించారు.

- చిలకలూరిపేట వైపు నుండి విశాఖపట్నం వెళ్లే వాహనాలను ఎన్‌హెచ్ - 16 మీదుగా పెదనందిపాడు, కాకుమాను, పొన్నూరు, చందోలు, చెరుకుపల్లి, భట్టిప్రోలు, పెనుమూడి బ్రిడ్జ్ మీదుగా.. అవనిగడ్డ, పామర్రు గుడివాడ - హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించినట్లు తెలిపారు.
- చెన్నై నుండి విశాఖపట్నం వెళ్లే వాహనాలను బోయపాలెం క్రాస్ వద్ద నుండి ఉన్నవ గ్రామం, ఎ.బి.పాలెం, వల్లూరు, పాండ్రపాడు, పొన్నూరు, చందోలు, చెరుకుపల్లి, భట్టిప్రోలు, పెనుమూడి బ్రిడ్జ్ మీదుగా.. అవనిగడ్డ, పామర్రు -గుడివాడ-హనుమాన్ జంక్షన్ నుండి విశాఖపట్నం వైపు మళ్లించినట్లు తెలిపారు.
- గుంటూరు నుండి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను బుడంపాడు క్రాస్ మీదుగా తెనాలి - వేమూరు- కొల్లూరు - వెల్లటూరు జంక్షన్ - పెనుముడి బ్రిడ్జ్ మీదుగా... అవనిగడ్డ, పామర్రు - గుడివాడ - హనుమాన్ జంక్షన్ నుంచి విశాఖపట్నం వైపు మళ్లించినట్లు తెలిపారు.
- గన్నవరం నుండి హైదరాబాద్‌కు వయా ఆగిరిపల్లి - శోభనాపురం, గణపవరం, మైలవరం జి. కొండూరు ఇబ్రహీంపట్నం మీదుగా వెళ్లాలి.
- విశాఖపట్నం నుండి హైదరాబాద్ వైపు : హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు - మైలవరం జి.కొండూరు - ఇబ్రహీంపట్నం వైపు భారీ గూడ్స్ వాహనాలు వెళ్లాలని సూచించారు. హైదరాబాద్ నుండి విశాఖపట్నం ఇదే మార్గంలో వెళ్లాలని తెలిపారు.

మల్టీ-యాక్సిల్ గూడ్స్ వాహనాలకు ప్రత్యేక సూచనలు

చెన్నై నుండి విశాఖపట్నం: ఈ వాహనాలు చిలకలూరిపేట, ఒంగోలు, నెల్లూరు వద్ద జాతీయ రహదారి దగ్గర మళ్లింపు లేకుండా నిలిపివేసుకోవాలని సూచించారు.

విశాఖపట్నం నుండి చెన్నై: ఈ వాహనాలు హనుమాన్ జంక్షన్, పొట్టిపాడు టోల్ గేట్ వద్ద జాతీయ రహదారి దగ్గర నిలిపివేయాలన్నారు.

ఆగిన అన్ని మల్టీ-యాక్సిల్ వాహనాలు మే 2న రాత్రి 9 గంటల తర్వాత ముందుకు సాగడానికి అనుమతిస్తామని తెలిపారు. ఈ సమయంలో ట్రాఫిక్ సజావుగా సాగేలా చూసేందుకు ప్రయాణికులు సహకరించాలని పోలీస్ అధికారులు కోరారు.

జీవితాంతం రుణపడి ఉంటాం

- కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
- తాకట్టులోని ఇంటి పత్రాలు విడిపించి అందజేత
- ఆనంద భాష్పాలతో.. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాటకు కట్టుబడి.. నిలబడ్డారు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు. తాకట్టు లో ఉన్న కార్యకర్త ఇంటి పత్రాలను విడిపించి.. ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. పిడుగురాళ్ల పట్టణంలోని 13 వార్డుకు చెందిన షేక్ సుభాని టీడీపీ ఆవిర్భావం నుండి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేశాడు. ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనే వాడు. రెండు నెలల క్రితం సుభాని గుండెపోటుతో మృతి చెందగా పరామర్శిం చేందుకు సుభాని ఇంటికి యరపతినేని వెళ్లారు. సుభాని భార్య ఫాతిమా కన్నీటి పర్యంతమవుతూ.. ఉన్న ఇంటిని భర్త తాకట్టు పెట్టాడని, తాము ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామంటూ ఎమ్మెల్యేకు గోడు వెళ్లబోసుకుంది. పిల్లల చదువు, కుటుంబం నిర్వహణ కూడా కష్టంగా మారిందని ఫాతిమా కుటుంబ సభ్యులు వాపోయారు. దీంతో చలించిన యరపతినేని అప్పటికప్పుడు ఆ ఇంటిని తాకట్టు నుండి విడిపించేందుకు, కుటుంబ పోషణ నిమిత్తం రూ. 3 లక్షల నగదును గత నెలలో అందించారు. తాకట్టులో ఉన్న ఇంటిని విడిపించి పత్రాలను తానే స్వయంగా అందిస్తానని చెప్పి.. బుధవారం సుభాని భార్య ఫాతిమా, కుటుంబ సభ్యులకు ఇంటి దస్తావేజులను అందజేశారు.



షేక్ ఫాతిమా కుటుంబసభ్యులకు ఇంటి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

సుభాని కుటుంబం పట్ల యరపతినేని చూపిన చొరవపై మైనారిటీ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.



మాట నిలబెట్టుకున్నారు..: షేక్ ఫాతిమా

నా భర్త సుభాని చనిపోయాక పరామర్శకు వచ్చిన ఎమ్మెల్యే యరపతినేని.. ఆనాడు మాకు ఇచ్చిన భరోసాను రెండు నెలల్లో నిలబెట్టుకున్నారు. సొంతింటిని తిరిగి అప్పచెప్పడం నిజంగా ఆయ నకే సాధ్యమైంది. జీవితాంతం మా కుటుంబం ఆయనకు రుణపడి ఉంటుంది.

లంచావతారంపై..ఆరా

- ట్రెజరీ ఉద్యోగిపై రాష్ట్ర డైరెక్టర్ సీరియస్!
- వివరణ కోరతామన్న జిల్లా అధికారులు
- సమాచారం లీక్ చేశారంటూ సిబ్బందిపై సాధింపులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తెనాలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తెనాలి సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఓ ఉద్యోగి లంచాల వేధింపులపై ఆ శాఖ ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం. 'అడిగినంత ఇస్తేనే బిల్లు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై.. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులే సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారే స్వయంగా తెనాలి వ్యవహారంలో వాస్తవాలపై వివరణ కోరినట్లు తెలిసింది. ఇదిట్లా ఉంటే... జిల్లా ట్రెజరీ అధికారి చంద్రశేఖరరెడ్డిని దీనిపై ప్రశ్నిస్తే.. లంచాలకు పాల్పడిన ఉద్యోగి ఎవరనేది ఆరా తీస్తున్నామని తెలిపా రు. బాధితులెవరూ నేరుగా తమకు ఫిర్యాదు చేయలేదని, అయినా శాఖపరమైన విచారణ చేస్తున్నామని సమాధానం ఇచ్చారు. సంబంధిత ఉద్యోగికి నోటీసులు జారీ చేసి, వివరణ కోరనున్నట్లు పేర్కొన్నారు. అయితే బాధితులు ఆ ఉద్యోగి ఎవరనేది స్పష్టంగా తెలియజేస్తే.. నేరుగా విచారణకు దిగుతామని స్పష్టం చేస్తున్నారు. మరోపక్క రెవెన్యూ అధికారులు కూడా ఆ ఉద్యోగి తీరుపై మండిపడుతున్నారు. తోటి ఉద్యోగి.. కనీస కనికరం లేకుండా తమ సిబ్బంది బిల్లుల విషయంలోనే దాడుణంగా వ్యవహరించడమే కాకుండా, జిల్లా కలెక్టర్‌నే కించపరిచే విధంగా మాట్లాడితే సహించబోమంటున్నారు. దీని పై శాఖపరంగా చర్యలకు దిగుతామంటూ వారూ హెచ్చరిస్తున్నారు. అటు మున్సిపల్ సిబ్బంది కూడా తమకు ఎదురవుతున్న ఇబ్బందులను ఆ శాఖ అధికారులకు విన్నవిస్తామని, సదరు ఉద్యోగిపై చర్యలకు డిమాండ్ చేస్తామని పేర్కొంటున్నారు. ఆంధ్రజ్యోతి కథనంతో.. కార్యాలయంలోని వివరాలు బయటకు ఎలా లీకయ్యాయని చిందులు తొక్కిన సదరు ఉద్యోగులిద్దరూ.. అనుమానం ఉన్న సిబ్బందిపై ప్రత్యక్షంగానే కక్ష సాధింపులకు దిగారని ఒకరిద్దరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో ఉన్నతాధికారి కూడా అతనికే మద్దతిస్తూ వారిపై చర్యలు తప్పవంటూ బహిరంగంగానే హెచ్చరించారని బాధితులు చెబుతున్నారు. పత్రికల్లో కథనాలు రావడానికి తామే కారణమంటూ కక్ష సాధింపులకు దిగితే ఉన్నతాధికారుల దగ్గరకు వెళ్తామని వారు చెబుతున్నారు.

ఆలోచింపజేసిన నాటక ప్రదర్శనలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. పల్లెకోనలో పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మూడు నాటకాలను ప్రదర్శించారు. యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ విజయవాడ వారి '27వ మైలురాయి' నాటకం పీటీ మాధవ్ రచించగా ఆర్.వాసు దర్శకత్వం వహించారు. నిజం గెలుస్తుందన్న కథా సారాంశంతో ప్రారంభమైన నాటిక గెలుచేదంతా నిజం కాదు అనే ప్రధాన అంశంగా మైలురాయి నాటకం.. 1932లో జరిగిన యదార్థ ఘటనలు కళ్లకట్టింది. న్యాయవాదులు న్యాయం కోసం అన్న సంగతి మరిచిపోయి.. పేరుకు మాత్రమే న్యాయవాదులు అనే ఇతివృత్తంతో కూడిన ఈ నాటకం ప్రేక్షకుల ఆదరణ పొందింది. రెండవ ప్రదర్శన ఇచ్చిన.. సిరిమువ్వ కల్చరల్ హైదరాబాద్ వారి 'హక్కు' నాటికను యడారి సోమశేఖర్ రచించగా, మంజునాథ దర్శకత్వం వహించారు. సమాజంలో ఆస్తుల కోసం కుటుంబాల మధ్య జరుగుతున్న సంఘర్షణల సారాంశంగా రూపొందిన ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. మూడో ప్రదర్శన అరవింద్ తాడేపల్లి వారి 'విడాకులు కావాలి' నాటికను కొత్తూరు విజయలక్ష్మి, వల్లూరు శివప్రసాద్ రచించగా, గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు. నటీనటుల హావభావాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. నాటక ప్రదర్శనలకు వ్యాఖ్యాతగా అయినాల మల్లేశ్వరరావు వ్యవహరించారు. కళాకారులకు పరుచూరి వెంకటేశ్వరరావు, సినీనటి శివపార్వతి పారితోషికాలను అందజేశారు. వేజండ్ల బసవపున్నారావు, సాంబశివరావు, సతీష్, రామకోటేశ్వరరావు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



27వ మైలురాయి నాటకంలోని ఓ సన్నివేశం

విద్య ఓ బ్రహ్మాస్త్రం..ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

- వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు
- "లైఫ్ ఆఫ్ కర్మయోగీ" పుస్తకావిష్కరణ

పెదకాకాని, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి విద్య ఒక బ్రహ్మాస్త్రం అని రాష్ట్ర హెల్త్ మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడితేనే జీవితంలో విజయం వరిస్తుందని ఆయన సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం.గోపాలకృష్ణ రచించిన "లైఫ్ ఆఫ్ కర్మయోగీ" పుస్తక సమీక్ష చర్చ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని, సమయాన్ని సోషల్ మీడియాలో దుర్వినియోగం చేసుకోకూడదని హితోపదేశం చేశారు. ఆరు దశాబ్దాల విలువలతో కూడిన నైతిక ప్రయాణ సివిల్ సర్వెంట్ ఎం.గోపాలకృష్ణ జ్ఞాపకాలే లైఫ్ ఆఫ్ కర్మయోగీ పుస్తకమని వ్యాఖ్యానించారు. పుస్తక రచయిత ఎం.గోపాలకృష్ణ భారతదేశ వ్యాప్తంగా తన సర్వీసులో ఎదురైన అనుభవాలు విద్యార్థులతో పంచుకున్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి వీఎస్ విష్ణు సభాధ్యక్షత వహించారు. అతిథులుగా ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఆర్ట్స్ కామర్స్ లా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, విశ్రాంత ఐజీ రవిచంద్ర పాల్గొన్నారు. ఏలూరి ఫౌండేషన్ ఛైర్మన్ ఏలూరి ప్రసాదరావు సమన్వయకర్తగా వ్యవహరించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సెక్రటరి ఎంటీ కృష్ణబాబు

రాజధాని నిర్మాణంతో
భావితరాలకు బంగారు భవిష్యత్తు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణంతో భావి తరాలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హ యాంలో విధ్వంసానికి గురైన రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిందని పే ర్కొన్నారు. రూ.65 వేల కోట్లతో.. 8,352 స్క్వేర్ కిలోమీటర్ల విస్తీర్ణంలో రాజధాని అమరావతి రూపుదిద్దుకోబోతుందని తెలిపారు. అమరావతి రాజధాని ప్రపంచం లోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుందన్నారు. రాజధానిలో పునః నిర్మాణ పనులకు రూ.48,012.67 కోట్ల వ్యయం అంచనాలకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. ప్రపంచ బ్యాంకు ఏడీబీల నుంచి రూ.15 వేల కోట్ల రుణం మంజూరైందని, జర్మనీకి చెందిన డెవలప్‌మెంట్ బ్యాంక్ కేఎఫ్ డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు రుణం పొందేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టినట్లు తెలిపారు. మొత్తం రూ.15,400లు కోట్లు అమరావతి నిర్మాణానికి హడ్కో రుణ సదుపాయం కల్పించడం హర్షణీయమన్నారు. ప్రజా రాజధాని అమరావతి పూర్త యితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతాయని తెలిపారు. రాజధానిలో నిర్మాణాలు పోగా రూ.2 లక్షల కోట్లకు పైన విలువైన మిగులు భూములు ఉన్నాయని తెలిపారు. పదేళ్ల తర్వాత సైబరాబాద్ తరహాలో.. ఇక్కడా భూముల విలువ ఎకరం రూ.50 కోట్లకు చేరుతుందని పేర్కొన్నారు.

అపరాధ రుసుంతో.. సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు

● రీ వెరిఫికేషన్‌కు నేటితో ఆఖరు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి రెగ్యులర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించాలని డీఈవో ఎల్.చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 19 నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, మూడు సబ్జెక్టులకు రూ.110, మించితే రూ.125 చెల్లించాలని పేర్కొన్నారు. ఫీజు చెల్లింపు గడువు బుధవారంతో ముగియడంతో.. గురువారం నుంచి పరీక్ష ముందు రోజు వరకు రూ.50 ఆలస్య రుసుముతో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు. రీకౌంటింగ్ కోసం సబ్జెక్టు రూ.500లు, రీ వెరిఫికేషన్ కోసం సెబ్జెక్టుకు రూ.1000లు సదరు పాఠశాలల ప్రధానోపాధ్యా యులకు గురువారం రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని డీఈవో తెలిపారు.

దూర విద్యలో సప్లిమెంటరీ ఫీజు ఇలా..

దూరవిద్యలో ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని డీఈఓ ఎల్.చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్‌సీలో సబ్జెక్టుకు రూ.వంద, ఇంటర్మీడియెట్‌లో సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ పరీక్షలకు రూ.వంద చొప్పున అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లింపునకు బుధవారంతో గడువు ముగిసిందన్నారు. అపరాధ రుసుముతో సబ్జెక్టుకు రూ.25 లెక్కన గురు, శుక్రవారం, రూ.50తో మే 3 నుంచి 4వ తేదీ వరకు, తత్కాల్ రుసుం పదవ తరగతికి రూ.500, ఇంటర్మీడియెట్‌కు రూ.1000 అని తెలిపారు. ఓపె న్ స్కూల్ వెబ్‌సైట్‌లో ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. రీకౌంటింగ్ కోసం జవాబు పత్రానికి రూ.200, రీవేరిఫికేషన్‌కు రూ.1000లు ఏపీ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ లో మత్రమే నేరుగా చెల్లించాలని తెలిపారు. డీడీ, ఇతర చెల్లింపులు అంగీకరిం చబడవని డీఈవో తెలిపారు.

ప్రత్యేక న్యాయవాది నియామకం

అమర్నాథ్‌గౌడ్ హత్య కేసులో కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం

ప్రాసిక్యూషన్ ప్రత్యేక న్యాయవాదిగా కావూరి గోపీనాథ్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన అమర్నాథ్‌గౌడ్ హత్య కేసుకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాసిక్యూషన్‌కు సహకరించడానికి హైకోర్టు న్యాయవాది కావూరి గోపీనాథ్‌ను ప్రత్యేకంగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. పదో తరగతి చదువుతున్న ఉప్పాల అమర్నాథ్‌గౌడ్‌ను 2023 జూన్ 16న అతికిరాతకంగా పెట్రోలు పోసి తగలబెట్టిన ఘటన చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామ పరిధిలో జరిగిన సంగతి తెలిసిందే. బాలుడి హత్యకు సంబంధించి కేసు నమోదు దగ్గర నుంచి ప్రాసిక్యూషన్ వాదనల వరకు గత ప్రభుత్వం అడుగడుగునా నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ పూర్తి చేస్తామని వైసీపీ ప్రభుత్వం చెప్పిన మాటలు కూడా అమలుకు నోచుకోలేదు. వీటి ఫలితమే ఆ దారుణమైన కేసులో నిందితులు 45 రోజుల వ్యవధిలోనే బెయిల్‌పై బయటకు వచ్చారు. కేసు విషయంలో గత ప్రభుత్వ వైఖరిని టీడీపీ తీవ్రంగా ఆక్షేపించింది. అధికారంలోకి రాగానే బాలుడు అమర్నాథ్‌గౌడ్ కుటుంబానికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన హామీలో భాగంగా ఈ ప్రత్యేక నియామకం జరిగింది.

కులగణన ఆర్థిక సమానత్వానికి దోహదం: పెమ్మసాని

గుంటూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జనగణనలో కులగణన కార్యక్రమం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి దోహదం చేస్తుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రగతికి, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే సంకల్పానికి కులగణన ఒక మార్గదర్శిగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక గొప్ప మార్పుకు సంకేతకంగా మారు తుందని, సామాజిక అసమానతలను చెరిపివేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రాణం తీసిన రూ.3వేల అప్పు

అచ్చంపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన ఎస్కే. సలీం(25) బుధవారం తెల్లవారుజామున గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. చింతపల్లి గ్రామానికి చెందిన యువకులకు రూ.3వేలు చెల్లించలేదని సలీం సెల్ ఫోన్ తీసుకున్నారు. దీంతో నామోషీగా ఫీల్ అయిన సలీం మూడు రోజుల క్రితం ఎలుకల మందు తాగాడు. ఆసుపత్రిలో చేర్పించడంతో.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు అచ్చంపేట పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

1,29,339 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,19,395 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,29,339 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 42,556 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13700
334	9500	13200	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12400	సింజెంటా బ్యాడిగి 5531	---	---
341	10000	13300	దేవనూరుడీలక్స్	10000	12600
4884	10000	11200	ఆర్మూరు	9800	11200
సూపర్10	10000	12500	తాలుకాయలు	4500	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					

15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలి

● కౌన్సిలర్ల డిమాండ్

దాచేపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ సమావేశంలో నిధుల వినియోగంపై కౌన్సిలర్లు అధికారులను, చైర్మన్‌లను ప్రశ్నించారు. బుధవారం నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశా నికి మహిళా చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షత వహించారు. నగర పంచాయతీ 14వ వార్డు కౌన్సిలర్ షరీఫ్ మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ఉన్న బ్రహ్మానాయుడు ఆడిటోరియం చుట్టూ వ్యాపారం చేసుకొనేందుకు స్థానికులకు అద్దెకు ఇవ్వాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, నగర పంచాయతీ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉందని, నిధుల నిర్వాహణపై పలు ఆరోపణలు వస్తున్నాయని ఆయన వివరించారు. అనంతరం మరి కొంత మంది సభ్యులు మాట్లాడుతూ నాగులేరుపై నిర్మించిన చెక్ డ్యామ్ దెబ్బతినటంతో నీరు వృథాగా పోతుందని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చెక్ డ్యామ్‌ను నిర్మించాలని, ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు.

గృహంలో చోరీ

● 40గ్రాముల బంగారం, రూ.25 వేల నగదు అపహరణ

కారంపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకానివారిపాలెంకు చెందిన నిమ్మగడ్డ రాఘవయ్య గృహంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవయ్య రాత్రి ఇంటి ఆరుబయట నిద్రకు ఉపక్రమించారు. బుధవారం వేకువజామున 4 గంటలకు నిద్రలేచి చూడగా ఇంట్లో బీరువా కనిపించలేదు. చుట్టుపక్కల వెతకగా పొలాల్లో బీరువా పగులకొట్టి తెరిచి ఉండడాన్ని గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి ఇంటి తాళం పగులకొట్టి లోపలకు చొరబడి బీరువాను ఇంటి వెనుక ఉన్న పొలాల్లోకి తీసుకెళ్లి బీరువాలోని 40 గ్రాముల బంగారం, రూ.25 వేల నగదు దోచుకెళ్లినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వాసు సంఘటనా ప్రదేశానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ కూలీ మృతి

గురజాలటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌పై నుంచి జారిపడి వ్యవసాయ కూలీ మృతిచెందిన ఘటన మండలంలోని దైదలో జరిగింది. దైద గ్రామానికి చెందిన గంగినేని రామయ్య (73) మిర్చి కోతలకు తోటి కూలీలతో కలిసి ట్రాక్టర్ ఎక్కాడు. గ్రామ శివారులో ట్రాక్టర్ టైరు ప్రమాదవశాత్తు గుంతలో పడడంతో ఆ కుదుపునకు ట్రాక్టర్‌లో వెనుక కూర్చున్న రామయ్య జారి కిందపడిపోయాడు. ఈ సంఘటనలో రామయ్య తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడ్ని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందాడు. కాగా ఈ సంఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

కందిపప్పు మిల్లు కార్మికురాలి మృతి

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

మాచర్లరూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కూలీ పనుల కోసం వెళ్లిన కార్మికురాలు కందిపప్పు మిల్లులో జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. ఈ ఘటన మాచర్ల పట్టణ శివారులోని రాయవరం జంక్షన్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వెల్దుర్తి మండలం రచ్చమలపాడుకు చెందిన కూరాకుల కాశమ్మ(44) మాచర్ల రాయవరం జంక్షన్‌లో గల తపస్వి లక్ష్మీబాలాజీ దాల్ ఇండస్ట్రీస్‌లో కార్మికురాలిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తోంది. కరోనా సమయంలో తన భర్త నరసింహారావు మృతి చెందాడు. అప్పటి నుంచి తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడిని పోషించుకునేందుకు కందిపప్పు మిల్లులో పనిచేస్తోంది. ఈనెల 13వ తేదీన అకస్మాత్తుగా మిషన్ రన్నింగ్‌లో ఉన్న బెల్ట్ ఊడి కాశమ్మపై పడింది. దీంతో కాశమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మాచర్ల పట్టణంలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి కాశమ్మ మృతి చెందింది. మృతదేహాన్ని మంగళవారం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మాచర్ల రూరల్ ఎస్‌ఐ రవిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని కాశమ్మ బంధువులు ఆరోపిస్తున్నారు.

విద్యా వ్యవస్థలో పెను మార్పులు

● రూపు రేఖలు మారుతున్న ప్రభుత్వ పాఠశాలలు : ఎంఈవో

సత్తెనపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యమిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పునకు శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను మార్చబోతుంది. సత్తెన పల్లి మండలంలో 28 బేసిక్ ప్రైమరీ పాఠశాలలు, తొమ్మిది ఫౌండేషన్ పాఠశాలలు, 30 మోడల్ ప్రైమరీ పాఠశాలలు, మూడు కంటిన్యూ యూపీ స్కూల్స్ 14 హైస్కూళ్ళు ఈ విధంగా పాఠశాలల రూపురేఖలు ఉంటాయని ఎంఈవో శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మండలంలో 60మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేశారు. ఆదర్శ పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించటం వల్ల వారు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించే వీలుంటుంది. తద్వారా విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఆయన అన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 24.54 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 3,700 క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కులు, మొత్తం నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

దొడ్లేరులో నీటి ఎద్దడి తీవ్రం

● నిరుపయోగంగా మంచి నీటి పథకం

● బావుల్లో, చెరువుల్లో అడుగంటిన నీరు



చెరువులో అడుగంటిన నీరు

క్రోసూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరులో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. కనీస అవసరాలకు కూడా నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పేరుకు రెండు ట్యాంకులు, మంచి నీటి పథకం ఉన్నప్పటికీ అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. నిర్వాహణ లోపమే నీటి ఎద్దడికి కారణంగా స్థానికులు చెపుతున్నారు. మంచి నీటి పథకం సమీపంలో పెద్ద బోరు ఏర్పాటు చేశారు. బోరులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ పైపులైన్‌లు సక్రమంగా లేక పోవటం, మరమ్మతులకు గురైనా పట్టించుకోక పోవటం నీటి ఎద్దడికి కారణాలుగా చెపుతున్నారు. చెరువును ఇటీవల దాతల సాయంతో బాగు చేయించారు. చెరువులో కూడా నీరు ఒక మోస్తరుగా ఉన్నాయి. జలజీవన్ మిషన్ ద్వారా 1.50 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంక్ నిర్మించినప్పటికీ అది కూడా నిరుపయోగంగానే ఉంది. ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసినా నీరు రావటం లేదు. కొన్ని కాలనీల వారు వారం నుంచి నీటి సరఫరా లేక ఇబ్బందులకు గురవుతున్నామని, పైపులైన్‌లకు మరమ్మతులు చేసేందుకు గుంతలు తీసినప్పటికీ పనులు మాత్రం జరగటం లేదని చెపుతున్నారు బావుల్లోను, బోర్లలోను నీరు అడుగంటాయి. ఎక్కడైనా బావి గాని, బోరు గాని పని చేస్తుంటే మహిళలు బిందెలతోను, బక్కెట్లతోను తమ వంతు వచ్చే వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు తక్షణ చర్యలు చేపట్టి దొడ్లేరులో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



నీటి కోసం రోడ్డుపై ఎదురు చూస్తున్న మహిళలు



నిరుపయోగంగా ఉన్న మంచి నీటి ట్యాంక్

పైపులైన్‌లకు మరమ్మతులు నిర్వహిస్తున్నాం

దొడ్లేరులో పైపులైన్‌లు మరమ్మతులకు గురైన మాట వాస్తవమేనని, వాటిని బాగు చేయించి నీరు సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి కే వెంకయ్య తెలియజేశారు. సాధ్యమైనంత తొందరలో మంచి నీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. పరిస్థితి తీవ్రత గురించి ఉన్నతాధికారులకు కూడా తెలియజేసినట్టు తెలిపారు.

అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం దాచేపల్లిలో శ్రీ వీర్లంకమ్మ 25వ వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకొని జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను బుధవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై నుంచి యరపతినేని ప్రసంగాన్ని కొనసాగిస్తూ శ్రీఅంకాళమ్మ తల్లి కొలుపులు, కుల, మతాలకు అతీ తంగా ప్రజలందరూ కలసి చేసుకోవటం శుభ పరిణామమన్నారు. స్ఫూర్తిదాయ కంగా నిర్వహిస్తున్న ఎడ్ల పోటీలు, తిరునాళ్ల, అమ్మవారి కల్యాణాలు చేయటం, నిత్యం వేలాది మందికి అన్నదానం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను యరపతినేని అభినం దించారు. ఆలయ కమిటీ సభ్యులు కొప్పుల గిరి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వేద మంత్రాల మధ్య స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో తంగెళ్ళ శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, పగడాల భాస్కరరావు, నర్రా పుల్లయ్య, సొసైటీ నారాయణ, రుద్రాల అచ్చరావు, కూరాకుల నాగేశ్వరరావు, అక్కినపల్లి బాలయ్య, బొమ్మిరెడ్డి సత్యం, వేముల వినోద్‌రెడ్డి, నెల్లూరి రామ కోటయ్య, మూలె రామారావు, చికెన్ జానీబాషా, మాజీ ఎంపీటీసీ తోట వెంకటేశ్వర్లు, శ్రీరామ దాసు అంజి, తూమాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం ఎడ్ల జత మొదటి స్థానం

మంగళవారం రాత్రి జరిగిన సేద్యం విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 5,122 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 4757 దూరాన్ని లాగి రెండో స్థానంలో, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామానికి చెందిన సంపటం వీరబ్రహ్మం నాయుడు ఎడ్ల జత 4750 దూరాన్ని లాగి మూడో స్థానంలో, తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడ గ్రామానికి చెందిన డాక్టర్ షేక్ హుస్సేన్, హుజూర్‌నగర్ గ్రామానికి చెందిన జక్కుల సహస్ర యాదవ్ ఎడ్ల జత 4644 అడుగుల దూరాన్ని లాగి నాలుగో స్థానంలో, పల్నా డు జిల్లా మాచవరం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన యామిని మోహన్‌శ్రీ, కృష్ణా జిల్లా తోటవల్లూరు మండలం చిన పులిపాక గ్రామానికి చెందిన ఎడ్లజత 4250 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మర్రివేముల గ్రామానికి చెందిన సిద్ది మల్లేశ్వరి ఎడ్ల జత 3914 అడుగుల దూరాన్ని లాగి ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదుతో పాటు షీల్డ్‌లను కూడా విజేతలకు అందజేశారు.

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్వాగతం



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ విమానాశ్రమంలో స్వాగతం పలికారు. బుధవారం తెలంగాణా నుంచి గన్నవరం విమానాశ్రయానికి రేవంత్‌రెడ్డి వచ్చారు. వారిని విమానాశ్రయంలో ప్రవీణ్ కలసి స్వాగతం పలికి సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు.

గ్రంథాలయ వారోత్సవాలు

దుర్గి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయాధికారి వేణుగోపి ఆధ్వర్యాన గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగ్, కథలు చెప్పడంపై వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అసిస్టెంట్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరుగుపందెంలో రాష్ట్రస్థాయిలో ఆకాంక్షకి ప్రథమ బహుమతి



పరుగు పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతిని సాధించిన ఆకాంక్ష (ఎడమ నుంచి మొదటి బాలిక)

రెంటచింతల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అండర్ 14 సీనియర్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో నాగిరెడ్డి ఆకాంక్ష ప్రథ మ బహుమతిని కైవశం చేసుకున్నట్లు శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ అన్నపరెడ్డి హరిణి చెప్పారు. డాక్టర్ బీఎస్‌ఆర్ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా బుధవారం ఉదయం విజయవాడలోని ఇందిరాగాంధి స్టేడియంలో నిర్వహించిన పరుగు పందెం పోటీల్లో 23 జిల్లాల నుంచి 23 గురు క్రీడాకారులు పాల్గొనగా ఎన్ ఆకాంక్ష ప్రథమ స్థానంలో నిలిచింది. 15 రోజుల క్రితం జిల్లా స్థాయిలో పరుగుపందెం పోటీలు నరసరావుపేటలో నిర్వహించగా ఆకాంక్ష మొదటి స్థానంలో నిలవడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఆకాంక్ష తండ్రి నాగిరెడ్డి అమర్నాధ్‌రెడ్డి సత్రశాల టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్నారు. ఆకాంక్షకు మెరిట్ అవార్డును శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యం అందచేసింది. టెయిల్‌పాండ్ ఇన్‌చార్జి ఎస్ఈ నాగరాజు, జీఎం శ్రీనివాస్, ఈఈ సుబ్రహ్మణ్యం, ఏడీఈలు రత్తయ్య, మల్లేష్, సుబ్బారావు తదితరులు ఆకాంక్షను అభినందించారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన నవరాత్రులను పురస్కరించుకొని బుధవారం అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం మహిళలు, భక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి కుంకుమ, చీర, సారెను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు యేలూరి చంద్రశేఖరరావు, కొలిశెట్టి సుబ్బారావు, కొత్త లక్ష్మీనారాయణ, కొత్తూరి అంజనేయులు, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి కేజీ వెండితో శ్రీవారి పీఠం అందజేత



కిలో వెండితో తయారు చేసిన శ్రీపాద పీఠంతో వస్తున్న అనిశెట్టి రమేష్ దంపతులు

దాచేపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలోని శ్రీ వీర్లంక మ్మ తల్లికి నారాయణ పురంనకు చెందిన అనిశెట్టి రమేష్, అరుణ దంపతులు రూ.1.50 లక్షలు విలువైన వెండితో తయారు చేసిన శ్రీపద్మపీఠం అమ్మవారికి అందజేశారు. బుధవారం అక్షయ తృతీయ పురస్కరించుకొని మేళ, తాళాలతో పురవీధుల్లో ఊరేగింపుగా అమ్మవారికి ఆలయంలో అందజేశారు. కార్యక్రమంలో అనిశెట్టి శ్రీను, కంప్యూటర్ శ్రీను, కోట సాయికుమార్, మాజీ ఎంపీటీసీ తోట వెంకటేశ్వర్లు, తోట వెంకట్రామయ్య, భువనేశ్వరి, భాగ్యలక్ష్మి, అనిశెట్టి సురేష్‌లు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో అనుగురాజు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



అనుగురాజు విగ్రహ శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): 11వ శతాబ్దంలో పల్నాడు రాజ్యాన్ని స్థాపించి పరిపాలించిన అనుగురాజు యాదవ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమం బుధవారం స్థానిక గంగమ్మగుడి సమీపంలో జరిగింది. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పల్నాడు యుద్ధానికి, పల్నాడు ప్రాంతానికి దగ్గర సంబంధం ఉందని, ఆనాటి పల్నాడు యుద్ధంలో పాల్గొన్న పల్నాటి యుద్ధవీరుల చరిత్రను రాబోయే తరాలకు గుర్తుండేలా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పిడుగురాళ్లలో అనుగరాజు విగ్రహ ఏర్పాటు కార్యక్రమం అభినందనీయమన్నారు. యరపతినేని తనయుడు సాయి నిఖిల్ మాట్లాడుతూ పల్నాడు చరిత్రను ఈనాటి యువతకే కాకుండా రాబోయే తరాలకు గుర్తుండేలా తెలియజేయాల్సిన అవసరం ఉందని, అనుగురాజు విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే తనవంతు సహకారం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మేకల రాంబాబు, ఆవుల జనార్ధనరావు, కొక్కెర కొండలు, గండికోట వెంకటేశ్వర్లు, పాండు రంగ శ్రీను, వీర్ల కృష్ణమూర్తి, చింతల అజయ్, కనిగిరి శ్రీను, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మాచర్ల పట్టణంలో కేక్‌ను కట్ చేస్తున్న గౌతమ్‌రెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కుమారుడు, టీడీపీ యువనేత గౌతమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గంలో మంగళవారం పొద్దుపోయే వరకు జరిగాయి. పట్టణంలోని సొసైటీ కాలనీలో గల టీడీపీ కార్యాలయంలో అభిమానుల సమక్షంలో గౌతమ్‌రెడ్డి కేక్ కట్ చేశాడు.

గ్రంథసిరి లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులకు అంచనాలు సిద్ధం

● సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారు రాజన్‌బాబు

అచ్చంపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రంథసిరి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా మూడు వేల ఎకరాలు సస్యశ్యామలంగా పంటలు పండుతాయని, అది మూడు సంవత్సరాలుగా మూలన పడటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారు రాజన్‌బాబు తెలిపారు. ఐడీసీ అధికారులతో మరమ్మతులకు అంచనాలు వేయించామని, రూ.55 లక్షలు అవసరమని తెలిపారు. ఈ స్కీమ్ నీటి ద్వారా గ్రంథసిరి, విప్పర్ల, ఓర్వకల్లు, వేల్పూరు గ్రామాలతో పాటు చిగురుపాడు, కోనూరు, ఊటుకూరు గ్రామాల్లోని వ్యవసాయ భూములకు నీరు అందుతుందని, దీని కింద మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి తీసుకు వెళ్లానని, వెంటనే నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారని రాజన్‌బాబు అన్నారు. ఐడీసీఈఈ శంకరమ్, ఎండీ తిరుమలరావు సుముఖంగా ఉన్నారని, మే నెలాఖరుకు పైపులైన్‌లు పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మూతపడిందని, ఐతే రీ ఎస్టిమేషన్‌తో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు పునర్జీవం తెస్తామని ఆయన తెలిపారు.

దేవతామూర్తుల, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

నకరికల్లు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దేవతా మూర్తుల ప్రతిష్ఠతో పాటు ఆలయాల ముందు ధ్వజ స్తంభాలు ప్రతిష్ఠించటంతో బుధవారం మండలంలోని త్రిపురాపురంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. విఘ్నేశ్వర స్వామి, నీలంపాటి అమ్మవారి దేవాలయంలో ధ్వజ స్తంభాలను ప్రతిష్ఠించారు. శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో దేవతా మూర్తుల విగ్రహాలతో పాటు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. నూతనంగా నిర్మించిన పోలేరమ్మ, పోతురాజు ఆలయంలో విగ్రహాలను పాత పాటేశ్వరి అమ్మవారి దేవాలయంలోను, లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి దేవాలయంలోను విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామంలో పండుగ సందడి నెలకొంది. వేలాది మందికి అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు నాగోతు శౌరయ్య, కనుమూరి బాజీ చౌదరి పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన నారు సరఫరా చేయాలి

రాజుపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన నారు సరఫరా చేయాలని సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐ పి.కిరణ్ పిలుపునిచ్చారు. బుధవారం రాజుపాలెంలో ఉన్న పోలీస్‌స్టేషన్లో నర్సరీ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేయాలని కోరారు. లైసెన్స్ తప్పక కలిగి ఉండాలన్నారు. కొన్న నారుకు బిల్లు ఇవ్వాలన్నారు. అవకతవ కలకు పాల్పడినట్లు ఫిర్యాదు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

రాజధాని పునర్నిర్మాణ సభకు తరలిరండి

● పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే యరపతినేని పిలుపు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల రాజధాని అమరావతి పునర్నిర్మాణ మహాసభకు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరుగనున్న అమరావతి రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత హాజరుకావాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తారన్నారు. నియోజకవర్గ పరిశీలకులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి అమరావతి మహాసభ ఆహ్వానపత్రికను ఎమ్మెల్యే యరపతినేనికి అందజేశారు. ఈ సమావేశంలో పాండురంగ శ్రీను, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, బడిగుంచల వెంకటేశ్వర్లు, బెల్లంకొండ బద్రి, అడపా శ్రీను, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పర్యటనను జయప్రదం చేయాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మోదీ పర్యటనను నియోజక వర్గంలోని కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాష్ నారాయణ, ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, ఆళ్ళ సాంబయ్య, మక్కపాటి రామచంద్రరరావు, కనుమూరి బాజీ చౌదరి, గోగినేని కోటేశ్వరరావు, పూజల వెంట కోటయ్య, లగడపాటి గజానన, శిరిగిరి శ్రీనివాసరావు, కోమటినేని శ్రీనివాసరావు, నూర్ బాషా జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి మోదీ సభను విజయవంతం చేద్దాం

● ఎమ్మెల్యే ప్రవీణ్



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలం నుంచి ప్రధానమంత్రి మోదీ సభకు పది మందికి తగ్గకుండా తగిన ఏర్పాట్లు చేయాలని టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దిశా, నిర్దేశం చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో జన సమీకరణ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరావతి రాజధానిని పునఃప్రారంభిస్తున్న ప్రధానమంత్రి సభకు ప్రజలు తరలి రావాలని, రాజధాని సమీపంలో ఉన్నాం, ఎక్కువ మంది వచ్చేలా చూడాలని తెలిపారు. మండలానికి 150 బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, ఉదయం 9 గంటలకే క్యాడర్ బయలు దేరాలని కోరారు.

● పెదకూరపాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో బుధవారం టీడీపీ మండల నేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ మే 2వ తేదీన అమరావతి రాజధాని అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు ఉగ్ర నరసింహారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం, అర్తిమళ్ళ రమేష్, పార్టీ నేతలు గంజినేని లీలావతి, బాష్యం ఆంజనేయులు, మక్కెన సాగర్, షేక్ ముంతాజ్, నెల్లూరి మల్లిఖార్జున్, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, జిల్లా అధికారి గబ్రునాయక్, ఏడీఏ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలి

● రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్

బెల్లంకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాయలంలో పార్టీ ముఖ్య నాయకులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ మండలం నుంచి ఐదు వేల మంది కూటమి నేతలు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు అక్కల వెంకట రామిరెడ్డి, వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, ఓర్చు ఆనంద్, హనుమంతరావు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి పునఃశంకుస్థాపనలో పాల్గొనాలి

● టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు

రాజుపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రేపు జరగనున్న ఆంధ్రుల ప్రజా రాజధాని అమరావతి పునఃశంకుస్థాపనకు రాజుపాలెం మండలం నుంచి భారీ స్థాయిలో ప్రజలు తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు బుధవారం పిలుపునిచ్చారు.

మోదీ సభను విజయవంతం చేయాలి : ఎంపీడీవో

దుర్గి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ మహాసభను విజయవంతం చేయాలని ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. మండలంలో మొత్తం 10 బస్సులను ఏర్పాటు చేశారని, ప్రజలను సభకు తరలించి క్షేమంగా ఇంటికి చేర్చాలని వారు సూపర్‌వైజర్లను కోరారు.

కార్యకర్త కుటుంబానికి బీమా నగదు అందజేత



కార్యకర్త కుటుంబానికి టీడీపీ బీమా నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అంటేనే కార్యకర్తలను ఆదుకునే పార్టీ అని స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో 13వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త నడికూడి శివనాగరాజు కుటుంబానికి పార్టీ బీమా నగదును ఎమ్మెల్యే యరపతినేని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు దేశ చరిత్రలోనే తెలుగుదేశం పార్టీకి దక్కిందని, పార్టీ సభ్యత్వం పొందిన ఎవరైనా అనుకోని ప్రమాదానికి గురై మృతి చెందితే పార్టీ సంక్షేమ నిధి నుంచి రూ.5 లక్షలు ఆ కుటుంబానికి అందజేస్తా మన్నారు. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన నడికూడి శివనాగరాజు కుటుంబానికి పార్టీ సభ్యత్వం ద్వారా అందిన రూ.5 లక్షల నగదును శివనాగరాజు భార్య అరుణకు యరపతినేని చేతులమీదుగా అందజేశారు. పార్టీతో పాటు తాను కూడా ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, పిల్లి చెన్నారావు, సుతారు నాగమల్లేశ్వరరావు, చింతల లక్ష్మీనారాయణ, కార్ సైదా, కోట హరి, ఎల్‌వీఆర్, ముప్పాళ్ల సాంబయ్య, సాంబశివరావు తదితరులు ఉన్నారు.

ఫలించని.. ఈ-శ్రమ్



పథకాలు ప్రారంభించడమే కాదు.. వాటి అమలుకు ఆర్థిక దన్ను ప్రభుత్వాలు అందించాలి. ఫలాలు లబ్ధిదారులకు అందాయో..లేదోనని పర్యవేక్షించాలి. లేకుంటే అవి ఎలా నిరర్ధకమవుతాయో.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-శ్రమ్ పథకం అందుకు ప్రత్యక్ష నిదర్శనం. కరోనా కల్లోలంలో విలవిల్లాడి పోయిన అసంఘటిత కార్మికుల దుస్థితిని చూసి.. వారిని సంఘటితంగా అభివృద్ధి చేసేందుకు ఈ-శ్రమ్ పోర్టల్‌ను తీసుకొచ్చింది. కార్మికుల వివరాలు అందులో పొందుపరిచి.. వారికి అన్ని ప్రయోజనాలు లభించేలా పథకం ప్రారంభమైన.. నాలుగేళ్లకు లబ్ధి పొందింది ఉమ్మడి ఉంటూరు జిల్లాలో ఇద్దరే అంటే.. పరిస్థితి అర్థమవుతుంది. దీంతో అసంఘటిత కార్మికులు కూడా.. ఈ పథకంపై నిరాసక్తత వ్యక్తపరుస్తున్నారు... మేడే సందర్భంగా విఫలమైన.. ఈ-శ్రమ్ పథకంపై ప్రత్యేక కథనం.

నేడు మేడే సందర్భంగా ప్రత్యేక కథనం..

గుంటూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులకు అండగా నిలవడం కోసం రూపొందించిన 'ఈ- శ్రమ్' పథకం కేవలం ప్రచారానికే పరిమితమైపోయింది. కరోనా కాలంలో ఎలాంటి భద్రత లేని కార్మికుల కోసం ప్రారంభించిన పథకం ఆచరణలో పూర్తిగా విఫలమయిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం ఈ- శ్రామిక్ పోర్టల్‌ను అట్టహాసంగా ప్రారంభించి, ఆ తర్వాత పట్టించుకోక పోవడంతో పథకం పూర్తిగా నీరుగారిపోయింది.

కార్డు ప్రయోజనాలు..

కరోనా లాక్‌డౌన్ పరిస్థితుల అనంతరం.. 2021 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం ఈ- శ్రామిక్ పోర్టల్ ద్వారా 'ఈ- శ్రమ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూ్యరెన్స్, గ్రాట్యూటీ వంటి సదుపాయాలు లేని అసంఘటిత కార్మికుల భవిష్యత్తు భద్రత కోసం ఈ పథ కాన్ని రూపొందించింది. కార్మికుల వివరాలను సేకరించి ఈ- శ్రామిక్ పోర్టల్లో అప్‌లోడ్ చేసి వారికి 'ఈ- శ్రమ్' గుర్తింపు కార్డులు ఇచ్చారు. ఈ కార్డు తీసుకున్న కార్మికులకు సంఘటితరంగ కార్మికులతో సమానంగా ప్రయోజనాలు కల్పిస్తామని చెప్పారు.

- కార్మికులు ప్రమాదానికి గురై పాక్షిక దివ్యాగులుగా మారితే కేంద్ర ప్రభుత్వం రూ. లక్ష చెల్లిస్తుంది.
- శాశ్వత వైకల్యం లేదా మరణం సంభవిస్తే కార్మికుడి కుటుంబానికి రూ.2 లక్షలు బీమా కవరేజీ వస్తుంది.
- ఇన్సూ్యరెన్సు మాత్రమే కాకుండా, పిల్లలకు ఉచితంగా సైకిళ్లు, పనిముట్లు, కుట్టు మిషన్లు ఇతర ఆర్థిక సహకారం అందిస్తుంది.

వీరంతా అర్హులే

ఈ- శ్రమ్ కింద అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులంతా అర్హులే. 16 నుంచి 59 ఏళ్లలోపు ఉంటేనే ఈ పథకం పరిధిలోకి వస్తారు. పరిశ్రమల్లో దిన కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, సున్నం, ఇటుక బట్టీల కార్మికులు, కార్పెంటర్లు, పెయింటర్లు, వీధి వ్యాపారులు, వ్యవసాయ కూలీలు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, టైలర్లు, మెకానిక్‌లు సహా పీఎఫ్, ఈఎస్ఐ, ఆదాయపు పన్ను చెల్లించని, రేషన్ కార్డుదారులు అర్హులు.

- అసంఘటిత కార్మికులకు అక్కరకురాని కార్డులు
- కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో పరిష్కారం కాని క్లెయిములు
- ప్రీమియం చెల్లించకపోవడంతో స్కీమ్ నిరుపయోగం
- గడిచిన నాలుగేళ్లలో 2 వేలకు పైగా క్లెయిములు
- పరిష్కారానికి నోచుకుంది 2 మాత్రమే!
- జిల్లాలో అర్హులైన లబ్ధిదారులు 20 లక్షలకు పైమాటే
- 'ఈ- శ్రమ్' కార్డులు పొందింది 2.20 లక్షల మందే..



అక్కరకురాని కార్డులు, అనాసక్తి

అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 20 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులు ఉంటారని అంచనా. అందులో 15 శాతం మందికి కూడా ఈ- శ్రమ్ కార్డులు లేవు. జిల్లా వ్యాప్తంగా 2.20 లక్షల మందికి మాత్రమే ఈ కార్డులు ఉన్నాయి. మిగిలినవారు కార్డులు తీసుకునేందుకు అనాసక్తి చూపుతున్నారు. అందుకు కారణం గడిచిన నాలుగేళ్లలో ఈ-శ్రమ్ క్లెయిమ్‌లు ఒక్కటి కూడా పరిష్కారం కాకపోవడమేనని తెలుస్తోంది. 2021 నుంచి ఇప్పటి వరకూ జిల్లా కార్మిక శాఖకు 2 వేలకు పైగా క్లెయిమ్‌లు రాగా, అందులో కేవలం 2 మాత్రమే పరిష్కారమై, ఇద్దరికి మాత్రమే ప్రయోజనం దక్కినట్లు తెలుస్తోంది. 2022 మార్చిలోపు దరఖాస్తు చేసుకున్న వారిలో ఆ ఇద్దరికి తప్ప ఎవరికీ ప్రయోజనాలు దక్కలేదని కార్మికులు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంకు చెల్లించాల్సిన ప్రీమియం చెల్లించకపోవడంతో పథకం నిరర్ధకమైపోయిందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం వైపు నుంచి సహాయం రాకపోగా ఈ- శ్రమ్ కార్డు దరఖాస్తు కోసం తమ సొంత డబ్బే ఖర్చు చేయాల్సి వస్తోందని, ప్రయోజనం లేని పథకం కోసం ఖర్చు చేయడం ఎందుకని పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉండగా తక్షణమే ఈ- శ్రమ్ క్లెయిములను పరిష్కరించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



దరఖాస్తు ఇలా

అర్హులైనవారు 'ఈ-శ్రమ్' కార్డుకోసం 'ఈశ్రమ్.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే సమీపంలో ఉన్న మీ-సేవ కేంద్రాల్లో అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డుతో లింకైన మొబైల్ నంబరుతో పేరును రిజిష్టర్ చేసుకోవాలి. మొబైల్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేసి లాగిన్ అవ్వాలి. అనంతరం అడ్రస్, విద్యార్హతలు ఇతర వివరాలు నమోదు చేయాలి. ఏ పనిలో నైపుణ్యం ఉంది. పని స్వభావంతో పాటు బ్యాంకు అకౌంట్ వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత మొబైల్ ఓటీపీని నమోదు చేస్తే ధ్రువీకరణ ప్రక్రియ పూర్తవుతుంది.

కార్మికులపై కేంద్రం చిన్నచూపు

ఈ- శ్రమ్ పథకాన్ని ప్రారంభించి నాలుగేళ్లయినా ఇప్పటి వరకూ ఒక్క క్లెయిమ్ కూడా పరిష్కారం కాలేదు. అందువల్ల కార్మికులు ఈ- శ్రమ్ కార్డులంటేనే అయిష్టంగా ఉన్నారు. ఈ శ్రమ్ కార్డులు కార్మికులకు ఎలాంటి భరోసా ఇవ్వలేకపోతున్నాయి. కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ చిన్నచూపుకు ఇది నిదర్శనం.

-దండా లక్ష్మీ నారాయణ, సీఐటీయూ

ప్రశాంతంగా 'పాలిసెట్'

● పరీక్షకు 84శాతం మంది విద్యార్థుల హాజరు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం సాంకేతిక విద్యాశాఖ బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు నగరంలో మొత్తం 11 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కో-ఆర్డినేటర్, ఎంబీ టీఎస్ కళాశాల ప్రిన్సిపల్ శేఖర్‌బాబు తెలిపారు. 4,055 విద్యార్థులకు గాను 3,408 మంది హాజరయ్యారని వెల్లడించారు. పరీక్ష ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు నిర్వహించారు. గంట ముందే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. డిస్‌ప్లే బోర్డుల్లో నంబరు పరిశీలించుకుని కేం ద్రాల్లోకి వెళ్లారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కో-ఆర్డినేటర్ వెల్లడించారు.



పరీక్ష కేంద్రంలోకి పరిగెడుతున్న విద్యార్థులు



పరీక్షలు పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు.

భోక్తల అక్రమాలపై.. నివేదిక సిద్ధం

- పొన్నూరు పట్టణంలోని ఆలయాల విరాళాల్లో మాయ
- వైసీపీ హాయంలో వంద కిలోల ఇత్తడి మాయం
- ఎమ్మెల్యే ధూళిపాళ్ల లేఖతో..దేవదాయ అధికారుల విచారణ
- సమగ్ర విచారణ అనంతరం చర్యలు

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన సహస్ర లింగేశ్వర, వీరాంజనేయ స్వామి ఆలయాల్లో గత ఆరేళ్లలో జరిగిన అక్రమాలపై నివేదిక దేవదాయశాఖ ఉన్నతాధికారులకు చేరింది. ఈ పుణ్యక్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల పేరిట అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆలయంలో ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా పలు చోట్ల ఐరన్ షెడ్లను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. ఈ నిర్మాణాలకు భక్తుల నుంచి కొందరు ఆలయ సిబ్బంది అనధికారికంగా విరాళాలు వసూలు చేయడమే కాకుండా.. ఆ నగదు ఆలయానికి జమ చేయకుండా సొంతానికి వినియోగించుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. కొందరు సిబ్బంది, ఉద్యోగులు ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామనే పేరుతో భక్తుల నుంచి భారీగా విరాళాలు దండుకున్నారు. ప్రత్యేక పూజల పేరిట వసూళ్లు చేసి.. స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఐదేళ్ల పాటు ఆలయంలో ఎలాంటి లెక్కలు లేకుండా.. ఇష్టారాజ్యంగా నిధులు ఖర్చు చేయడం వంటి ఆరోపణలపై ఇటీవల భక్తులు దేవదాయశాఖ ఉన్నతాధికారులకు నేరుగా ఫిర్యాదులు చేశారు.

వంద కిలోల ఇత్తడి మాయం..!

శ్రీ వీరాంజనేయస్వామి ఆలయలో.. దశావతారాల ఉప ఆలయం ఉంది. ఈ ఆలయానికి భక్తులు సమకూర్చిన వంద కిలోల ఇత్తడి రికార్డుల్లో లేకుండా మాయం అయింది. దశావతారాల ఆలయంలో శిథిలమైన ధ్వజ స్తంభాన్ని 2022 వ ఏలో పునఃప్రతిష్ఠించారు. ధ్వజ స్తంభానికి ఓ మహిళా భక్తురాలు ఇత్తడి మానిగలు తొడగడానికి రూ.1.50 లక్షలు విరాళమిచ్చారు. ఈ నగదు విరాళ వివరాలు, శిథిలమైన ధ్వజస్తంభానికి చెందిన వంద కిలోల ఇత్తడి తొడుగులు, బాలవెల్లి అలంకారాలు ఇతర వివరాలు ఏమీ ఆలయ రికార్డుల్లో నమోదు చేయలేదు. వంద కిలోల వరకు పాత ఇత్తడి ఓ వైసీపీ నాయకుడికి అనధికారికంగా అప్పగించినట్లు సమాచారం. మహిళా భక్తురాలు ఇచ్చిన విరాళం కూడా కొందరు ఉద్యోగులు సొంతానికే వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. 2022లో పునఃప్రతిష్ఠించిన ధ్వజనస్తంభం కూడా ఇత్తడి మానికల తొడుగులు లేకపోవడంతో.. కేవలం మూడేళ్లలోనే శిథిలమై.. పూజకు పనికి రాకుండా పోయింది. దీంతో అధికారులు బాల ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు.



శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలోని శిథిలమైన దశావతారాల ధ్వజస్తంభం

ఫిర్యాదులు బుట్టదాఖలు

విరాళాల సొమ్ము దుర్వినియోగంపై గతంలో భక్తులు అప్పటి వైసీపీ పాలకులకు ఫిర్యాదులు చేశారు. అధికారుల బాధ్యతారాహిత్యంతో.. అవి బుట్ట దాఖలు అయ్యాయి. ఇటీవల కొందరు భక్తులు స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌ను స్వయంగా కలసి.. ఆలయంలో జరిగిన అక్రమాల విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దేవదాయశాఖ ఉన్నతాధికారులకు అక్రమాల గుట్టు విప్పాలని లేఖ రాశారు. దీంతో ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు దేవదాయశాఖ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ఆలయ రికార్డులను తనిఖీ చేశారు. విరాళాలు అందజేసిన భక్తులను రహస్యంగా విచారించి, వారి నుంచి లిఖిత పూర్వకంగా సమాధానాలు రాబట్టారు. భోక్తలపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం. ఇత్తడి మానికల కోసం విరాళమిచ్చిన మహిళా భక్తులు రాలు కూడా విచారణకు హాజరై లిఖిత పూర్వక సమాధానాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. మరో కొద్ది రోజులలో ఈ అక్రమాలపై సమగ్ర విచారణ, నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని దేవదాయశాఖ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

(5వ పేజీ తరువాయి)

డీఎస్పీలు భద్రత ఏర్పాట్లలో క్షణం తీరికలేకుండా విధుల్లో నిమగ్నమయ్యారు. ప్రధాని రోడ్ షో, పాల్గొనే సభా వేదిక, శంకుస్థాపన చేసే పైలాన్ ప్రాంతాలను పోలీసు బలగాలు అదుపులోకి తీసుకుని పహారా కాయడమే కాకుండా అనుక్షణం తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ప్రధాని పర్యటనకు సంబంధించిన పూర్తి భద్రతా ఏర్పాట్లను ఎస్పీజీ పర్యవేక్షణలోనే నిర్వహిస్తున్నారు. ప్రత్యేక విమానంలో ప్రధాని మోదీ అడుగుపెట్టే గన్నవరం విమానాశ్రయం నుంచి రాజధాని ప్రాంతంలో పర్యటించే ప్రాంతాలన్నింటిలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా బుధవారం నిర్వహించిన అనధికార ట్రయల్ రన్ ఎటువంటి ఘటనలకు ఆస్కారం లేకుండా సజావుగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా గురువారం ట్రయల్‌రన్ నిర్వహించనున్నారు.

తనిఖీలు... సోదాలు

ప్రధాని పర్యటన దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర హోం శాఖల పరిధిలో అన్ని పోలీసు విభాగాలు రంగం లోకి దిగాయి. ఎస్పీజీ నేతృత్వంలో రాజధాని ప్రాంతాన్ని ఆయా బలగాలు జల్లెడ పడుతున్నాయి. రాజధాని గ్రామా ల్లో అడుగుపెట్టే సాధారణ వ్యక్తులను కూడా వదలకుండా తనిఖీలు చేస్తున్నారు. ప్రధాని సభ జరిగే వెలగపూడి ప్రాంతానికి సుమారు 25 కిలో మీటర్ల పరిధి నుంచే చెక్‌పోస్టులు, పికెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక బలగాలను రంగంలోకి దించారు. రాజధాని ప్రాంతానికి వచ్చే అన్ని రోడ్లలో పోలీసులు మోహరించాయి.

ఏర్పాట్లు పరిశీలించిన నారాయణ

వెలగపూడి సచివాయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రధాని బహిరంగ సభ, వేదిక వద్ద ఏర్పాట్లను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం వేర్వేరుగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు ఉన్నతాధికారులతో వారు మాట్లాడారు. వేదిక వెనుక అమరావతి పనులకు శంకుస్థాపన స్థూపం(పైలాన్) పనులను మంత్రి పరిశీలించారు. ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్, ప్రధాని సభ కార్యక్రమ నోడల్ అధికారి వీరపాండ్యన్ ఉన్నారు.

డ్రోన్‌లు, బెలూన్‌లు ఎగురవేయడం నిషేధం

ప్రధానమంత్రి మోదీ రాజధాని పర్యటన దృష్ట్యా వెలగపూడి సచివాలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో అనధికార డ్రోన్లు, బెలూన్లు ఎగురవేయడం నిషేధమని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. మే 2న తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెలగపూడి సచివాలయం సమీపంలో నిర్వహించనున్న రాజధాని పునఃప్రారంభ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో సచివాలయం, పరిసర ప్రాంతాల్లో అనధికారికంగా ఎటువంటి డ్రోన్లు, నలుపు రంగు బెలూన్స్, ఇతర రకాలైన బెలూన్స్ ఎగురవేయడం నిషిద్ధమన్నారు. ఈ పర్యటన నేపథ్యంలో హెలికాప్టర్ రాకపోకలు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో అనధికార డ్రోన్లు మరియు బెలూన్లు ఎగురవేయడం వలన ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉందన్నారు. వాటిని ఎగురవేయ రాదని ప్రజలకు సూచిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎవరైనా పోలీసుల హెచ్చరికలు అతిక్రమిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమరావతి.. అష్టదిగ్బంధనం



తుళ్లూరులో ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న రైతులు



ప్రధాని మంత్రి ఆవిష్కరించే పైలాన్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ



సీడ్ రోడ్డు మీద వాహనాల డైవర్షన్ కోసం ఏర్పాటు చేసిన పోలీసు చెక్ పోస్టు



ప్రధాని వచ్చే మార్గంలో జాగిలాలతో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

మున్సిపల్ సమావేశం వాయిదా

వినుకొండ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ మున్సిపల్ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశానికి హాజరైన చైర్మన్ డాక్టర్ దస్తగిరి సభ ప్రారంభమైన రెండు నిమిషాలకే అజెండాలోని పలు అంశాలు తమ దృష్టికి రావడం లేదని తెలిపి సభను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మినిట్ బుక్‌లో 39 అంశాలకు గాను ఒక్క అంశాన్ని మాత్రమే రాశారని, మిగతా అంశాలు బుక్‌లో చూపలేదని వాయిదా వేశామన్నారు. ఈ అంశంపై కమిషనర్ సుభాష్‌చంద్రబోస్‌ను వివరణ కోరగా అజెండాలోని అంశాలను వారం ముందుగానే చైర్మన్ దృష్టికి తెచ్చామన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుభానీనగర్‌లో బుధవారం ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్లు సంయుక్తంగా మహిళలకోసం ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. శిక్షణకు వచ్చిన మహిళలతో మాట్లాడిన ఆయన, త్వరలోనే కూటమి ప్రభుత్వం డ్వాక్రా మహిళల రుణాల పరిమితిని పెంచనుందని, స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలనుకునే మహిళలకు విరివిగా రుణాలు అందించాలనే ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, పఠాన్ సమద్ ఖాన్, జవ్వాజి మదన్ మోహన్, మద్దుమాల రవి, కందుల రమణ, శిక్షకురాలు అనితా భాయి పాల్గొన్నారు.

మే 2న జరిగే ప్రధాని సభను విజయవంతం చేయాలి: జిలానీ

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో మే 2న ప్రధాని నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ పిలుపు నిచ్చారు. బుధవారం నరసరావుపేట జనసేన కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సయ్యద్ జిలానీ మాట్లాడుతూ అమరావతి పునఃప్రారంభానికి జరిగే శంకుస్థాపన సభకు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు వేలాదిగా పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాదు, రొంపిచర్ల మండల అధ్యక్షుడు అచ్చుల సాంబశివరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా సెక్రటరీ బెల్లంకొండ ఈశ్వర్, అధికార ప్రతినిధి షేక్ అబ్దుల్ రవూఫ్, దుర్గకుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● వినుకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండమెట్ల వద్ద ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అక్షయ తృతీయ ఉత్సవ వేడుకలను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, మాజీ ఏజీపీ పోట్లూరి సైదారావు, పి.వి.సురేష్, జె.మాల్యాద్రి, నరసింహారావు, కృష్ణవేణి, పి.రమ, ఉష, సరోజనమ్మ పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లాలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని గ్రామ వ్యవసాయ సహాయకుల అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు పి.వెంకటరాజు కోరారు. బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళిని కలసి వినతి పత్రం అందజేశారు.

● నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ఆవరణలో శిక్షణకు ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్స్ పి.గీతాసాయిశ్రీవల్లి, పి.లిఖిత నందిని, పీఎస్.విజయ్‌కుమార్, బి.కిషోర్‌బాబు, ఎ.ఓగేష్‌లను ఘనంగా సత్కరించారు.

● నరసరావుపేట రూరల్: పట్టణంలోని వీరాంజనేయ సహిత శ్రీయోగాలక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణం కోసం పట్టణానికి చెందిన బండి శ్రీనివాసరావు, హేమలత దంపతులు రూ.1,00,116, కొత్త ప్రవీణ్, లక్ష్మీ అనూష దంపతులు రూ.25,116 విరాళంను బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

● ఈపూరు: వెలుగు ఏపీఎంగా సోమశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన రంగారెడ్డి బదిలీపై వెళ్లారు. రొంపిచర్ల ఏపీఎంగా పనిచేస్తూ సోమశేఖర్ బదిలీపై ఈపూరు వచ్చారు.

● వినుకొండ: ఎంపీడీవో కార్యాలయ ఏవోగా విధులు నిర్వహిస్తున్న చుట్టూరి రవిని వినుకొండ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు కల్పిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎంపీడీవోగా రవి బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేస్తున్న ఎంపీడీవో పుట్టారెడ్డి వైద్యకారణాలతో సెలవు పెట్టారు.

● నూజెండ్ల: మండలంలోని ఉప్పలపాడు రెవెన్యూ గ్రామంలో రీ సర్వే పనులు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. గ్రామ సర్వే సహాయకులను, రెవెన్యూ అధికారులను బృందాలుగా ఏర్పాటుచేసి రోవర్లతో రైతుల హద్దులను గుర్తిస్తున్నారు.

● రొంపిచర్ల: మండలంలోని వీరవట్నం సమీపంలోని దద్దనాల ఆంజనేయ స్వామిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావులు మంగళవారం రాత్రి దర్శించుకున్నారు.

● ఈపూరు: మండలంలోని ఉప్పరపాలెంలో బుధవారం కోదండ రామస్వామి ఆలయాలు, అభయాంజనేయ, వెంకటేశ్వర స్వామి, గంగమ్మ తల్లి, ఆఫీస్ ఎలా ప్రతిష్టా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

● నూజెండ్ల: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో పీ ఉమాదేవి మాట్లాడుతూ వేసవిలో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు నీడ ఏర్పాటు, తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఆంజనేయరాజు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మరింత చేరువగా సచివాలయం సేవలు



గ్రామ సచివాలయం

● క్లస్టర్లుగా విభజన
● క్లస్టర్లపై ఎంపీడీవోల పర్యవేక్షణ
● కూటమి ప్రభుత్వం నిర్ణయం

వినుకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల సేవను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం హేతుబద్ధీకరణకు నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించారు. ఈ మేరకు కొన్ని విధివిధానాలు సచివాలయ పాలన విభాగం, మండల పరిషత్ ప్రభుత్వ ఆదేశం మేరకు జిల్లా యంత్రాంగం పనులను పూర్తి చేసింది. మొత్తం జిల్లాలో 538 సచివాలయాలు ఉండగా వీటిని 268క్లస్టర్లుగా విభజించినట్లు డీఎల్‌డీవో వెంకటరెడ్డి తెలిపారు. ఈ సచివాలయాల్లో 4574 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

● గ్రామసచివాలయాల్లో 11 మంది, పట్టణాల్లోని వార్డు సచివాలయాల్లో 9మంది చొప్పున సిబ్బంది ఉంటారు. వీరిని మూడు విభాగాలుగా విభజించారు.

● బహుళార్థక: ఈ విభాగంలో నాలుగు కేటగిరీల్లో ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శి, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శి ఉంటారు. వీరు సర్వేలు చేపడతారు. ఇతర సేవలు క్లస్టర్ స్థాయిలో అందిస్తారు.

● సాంకేతిక: ఈ విభాగంలో వ్యవసాయ, ఉద్యాన, ఇంజనీరింగ్, ఆరోగ్య, పశుసంవర్ధక, విద్యుత్ సహాయకులు, సర్వేయర్లు ఉంటారు.

● ఏస్పిరేషన్: ఈ విభాగంలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో అనుభవం ఉన్న ఉద్యోగులను గుర్తించి వీరిని ఐటీ అవసరాలకు వినియోగిస్తారు.

● ప్రతి మండలంలో సమీపంలో ఉన్న సచివాలయాలను క్లస్టర్‌గా చేశారు. సచివాలయాల సరి సంఖ్యను బట్టి క్లస్టర్‌ను ఏర్పాటుచేశారు. బేసి సంఖ్యలో ఉన్న ఒక క్లస్టర్ పరిధిలో మూడు సచివాలయాలను తీసుకున్నారు. బహుళార్థక విభాగంలో జనాభా ప్రాతిపదికన, సాంకేతిక విభాగంలో క్లస్టర్ పరిధిలో ఉద్యోగులను గుర్తించారు. వీళ్లు రెండేసి సచివాలయాల్లో పనిచేయాల్సి ఉంటుందని, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి తెలిపారు. క్లస్టర్ల పనితీరు ఎంపీడీవోలు పర్యవేక్షించనున్నారని డీఎల్‌డీవో వెంకటరెడ్డి తెలియజేశారు.



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు చెక్‌ను అందజేస్తున్న ఏఎంరెడ్డి విద్యా సంస్థ సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తదితరులు

అక్షయపాత్ర ఫౌండేషన్‌కు రూ.లక్ష విరాళం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఎంపీ కార్యాలయంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో ఏఎంరెడ్డి విద్యాసంస్థ సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి రూ.లక్ష చెక్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అట్లూరి శాంతి మాట్లాడుతూ ఈ విరాళం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు పోషకాహారం, విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఇలాంటి సేవాకార్యక్రమాలను ప్రతి ఒక్కరికి తెలియజేస్తున్న నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ భార్గవ్ భూషణ్, డిప్లొమో కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించిన కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించడానికి డబ్బులు ఇవ్వమని కత్తితో బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు రెండో పట్టణ ఎస్‌ఐ లేఖ ప్రియాంక బుధవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని క్రిస్టియన్ పాలెంకు చెందిన మల్లెల భానుప్రకాష్ ఈ నెల 28వ తేదీ తెల్లవారుఝామున 2 గంటల సమయంలో మరికొందరితో కలిసి పెద్దగా కేకలు వేస్తుండగా దామవరపు నాగేశ్వరరావు వారిని మందలించి అక్కడి నుంచి పంపించి వేశాడు. అనంతరం 28వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో భాను ప్రకాష్ నాగేశ్వరరావు మెడపై పొడవైన కత్తి పెట్టి బెదిరించి 1500 రూపాయలు తీసుకున్నాడు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. అనంతరం నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లేఖ ప్రియాంక తెలిపారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఆమె తెలిపారు.

ప్రశాంతంగా చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ రఫాని అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ప్రశాంతంగా జరిగింది. తొలుత కాశ్మీర్ ఉగ్రదాడిలో అమరులైన వారికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం ఎజెండాలోని 37 అంశాలను ఆమోదించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు.10వ వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ పట్టణంలోని కేబీరోడ్డుతో పాటు మిగిలిన ప్రాంతాలలో ఆక్రమణలు తొలగించాలని, అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలాకాలు ఏర్పాటు చేయాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో తాగునీరు రంగు మారి వస్తుందని అధికారుల దృష్టికి తెచ్చారు. వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఎన్నడూ లేనివిధంగా పండరీపురంలో సైతం తాగునీటి సమస్య తలెత్తడం శోచనీయమని అన్నారు. మరోవైపు మున్సిపాలిటి పరిధిలో భారీ వృక్షాలు నరికివేస్తున్నారని దీనిపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. టీడీపీ పక్ష నాయకులు గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో నిబంధనలు అతిక్రమించి, కాల్వల ప్రవాహ మార్గాలను మార్చి నిర్మాణం చేసిన కట్టడంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఓల్డ్ బ్యారక్ నగర్‌లో పని చేసే వారు మేకులు రోడ్డుపై వదిలి వేస్తున్నారని, ఈ కారణంగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ మున్సిపల్ సమావేశాల లోనే కాకుండా తమ వార్డుల సమస్యలను కౌన్సిల్ సభ్యులు నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

తాగునీటి సమస్యపై అధికారుల వివరణ

పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు, డీఈఈ అబ్దుల్ రహీంలు తెలిపారు. పట్టణంలో ఏ ప్రాంతంలోనైనా తాగునీటి సమస్య ఉన్నట్లు ఫిర్యాదు వస్తే వెంటనే స్పందిస్తున్నట్టు చెప్పారు. కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోతే 4 ట్యాంకర్లు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. చెట్ల నరికివేత విషయంపై కమిషనర్ స్పందిస్తూ గతంలో గాంధీపార్కులో టేకు చెట్లను పొరపాటును అప్పట్లో లీజుకు తీసుకున్న నర్సరీ వారు కొట్టి వేశారని, దాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుందన్నారు. విశ్వనాథ్ థియేటర్ ఎదురు ఉన్న దశాబ్దాల నాటి రావి చెట్టు కొట్టివేతపై విచారణ జరుగుతున్నదని వెల్లడించారు.

ఉచిత విద్య కోసం దరఖాస్తుల ఆహ్వానం

బొల్లాపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12(1సీ) ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ఉచిత అడ్మిషన్ పొందవచ్చని బొల్లాపల్లి ఎంఈవో పార్వతి తెలిపారు. బుధవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో మాట్లాడుతూ విద్యార్థులు వారి నివాస సమీప ప్రాంతాల్లో (సీబీఎస్‌ఈ, ఎస్‌ఎల్‌ఈ, ఏబీ స్టేట్ సిలబస్)ను అనురిస్తున్న అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లు ఉచితంగా కేటాయించినట్టు తెలిపారు. మే 2 నుంచి 19వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని మండలంలో అర్హులైన పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కోరారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

వినుకొండ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి - విఠంరాజుపల్లి వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వర్లు బుధవారం స్థానిక తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా కాలువకు మరమ్మతులు చేపట్టలేదని, దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా కాలువకు మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు వెంటనే అంచనాలు తయారుచేసి రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు పగడాల చిన్నకోటిరెడ్డి, గంటా రంగారావు, యాదాల శంకర్, వెంకటేశ్వర్లు, చంద్రారెడ్డి, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐకు ఘన సన్మానం

నరసరావుపేట లీగల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులును పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సత్కరించారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆంజనేయులు దంపతులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ సంతోష్, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, దుర్గాప్రసాద్, పల్నాడు జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు మాణిక్యాలరావు, సిబ్బంది ఆంజనేయులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీహెచ్‌వోల నిరవధిక సమ్మె

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలోని నేషనల్ హెల్త్ మిషన్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్నవారిని క్రమబద్ధీకరించాలని సీహెచ్‌వోలు డిమాండ్ చేశారు. బుధవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట గాంధీపార్కు వద్ద వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేస్తున్న సీహెచ్‌వోలు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీహెచ్‌వోలు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. ప్రతినెల జీతంతో పాటు ఇన్సెంటివ్‌లు ఇవ్వాలని, ప్రతి ఏడాది 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం.అనుపమ, సాగర్, రాము, మస్తాన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా, సామాజిక సేవలకు ఇద్దరికి డాక్టరేట్



డాక్టరేట్‌లు అందుకొన్న హెచ్‌ఎంలు రాజారమేష్, నాగేశ్వరరావు

శావల్యాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యా, సామాజిక రంగాల్లో అందించిన సేవలకు గాను పల్నాడు జిల్లాలోని ఇద్దరు ప్రధానోపాధ్యాయులు గౌరవ డాక్టరేట్‌లను పొందారు. ఢిల్లీకి చెందిన వరల్డ్ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ద్వారకానగర్ లైబ్రరీ హాలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో శావల్యాపురం మండలం, కొత్తలూరు పంచాయతీ పరిధిలోని తుమ్మలకుంట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బిళ్లా రాజారమేష్, నూజండ్ల మండలం ప్రకాష్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాల్లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న గంటా నాగేశ్వరరావులకు గౌరవ డాక్టరేట్ అందించారు. వీరిని ఎంఈవోలు ఎం.సాంబశివరావు, పి.లలితాకుమారి, ఎన్.రవిచంద్ర, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధి హామీ కూలీలను బీమా పథకంలో చేర్చండి

● శావల్యాపురం ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలందరినీ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రధానమంత్రి బీమా యోజన పథకంలో చేర్చాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రమాదాలబారిన పడిన ఉపాధి హామీ కూలీలకు భరోసాను కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బీమా పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని, వారితో బాగా పని చేయించి గరిష్ట వేతనం రూ.307లను పొందేలా కృషి చేయాలన్నారు. ఏపీవో కటారపు రామారావు, ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్ల పంపిణీ



వీల్ చైర్లు అందుకున్న వారితో రోటరీ క్లబ్బుల నిర్వాహకులు

చిలకలూరిపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ చిలకలూరిపేట, రోటరీ క్లబ్ పండరీపురం, ఇన్నర్ వీల్ క్లబ్ చిలకలూరిపేట వారి సంయుక్త ఆధ్వర్యంలో వీల్‌చైర్లు పంపిణీ కార్యక్రమం బుధవారం రోటరీ కమ్యూనిటీ హాలులో జరిగింది. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్, పిడుగురాళ్ల రోటరీక్లబ్ వారి సౌజన్యంతో 8మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.80వేల విలువ చేసే 8వీల్ చైర్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక కొమ్మినేని హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కొమ్మినేని వీర శంకరరావు, రోటరీ జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్‌చౌదరి, సర్వీస్ ప్రాజెక్టు చైర్మన్ కేఎస్‌ఆర్‌కే ప్రసాద్, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ విష్ణుబాబు, రోటరీ క్లబ్ పిడుగురాళ్ల అధ్యక్షుడు అశోక్ బాబు, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని, రోటరీ క్లబ్ చిలకలూరిపేట, రోటరీ క్లబ్ పండరీపురం అధ్యక్ష కార్యదర్శులు ఆళ్ల వేమనరెడ్డి, వారణాసి శరత్ కుమార్‌శాస్త్రి, ఉప్పుటూరి ప్రసాద్, కొల్లా సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చిలకలూరిపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం ఈపూరివారిపాలెంలో గురువారం శ్రీఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. యాజ్ఞికులు గుంటూరు సురేషాచార్యులు (అచ్చంపేట) వారి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా 4వేల మందికి అన్న సమారాధన చేశారు. మహాపూర్ణాహుతి, శాంతి కల్యాణ మహోత్సవం, బండారుపల్లి కోలాట భజన బృందం వారిచే కోలాట ప్రదర్శన జరిగింది. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ వేర్వేరుగా ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పద్మావతి, ఆలయ ప్రధాన అర్చకులు రత్నాకరం బలరామాచార్యులు, బొల్లేపల్లి సత్యనారాయణ దంపతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మోదీ సభకు వెళ్ళేవారికి యడ్లపాడు వద్ద ఆహారం, నీరు

● ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ, డీఆర్వో

యడ్లపాడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మే 2న అమరావతిలో జరిగే ప్రధాని సభకు వినుకొండ, నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి తరలివెళ్ళే ప్రజలకు ఆహారం, నీరు అందించేందుకు యడ్లపాడు వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. బుధవారం ఎస్పీ కంచి శ్రీనివాసరావు, డీఆర్వో మురళితోపాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు యడ్లపాడు గ్రామాన్ని సందర్శించారు. వినుకొండ, నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రధాని సభకు తరలి వెళ్ళే వారి కోసం 369 బస్సులను ఏర్పాటుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బస్సులలో ప్రయాణించే వారికి ఆహారం, మంచినీటి సౌకర్యాలకోసం యడ్లపాడు మండలంలోని మూడు ప్రాంతాలను పరిశీలించగా, ఉప్పువాగు బ్రిడ్జి సమీపంలో హైవే సర్వీసు రోడ్డు పక్కన స్థలం అనుకూలంగా ఉండడంతో ఆ ప్రాంతాన్ని ఖరారు చేశారు.